

సోమశిలలో 43.653 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 43.653 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 162 క్యూసెక్కుల వరద వస్తుండగా, డెల్టాకు 3130, ఉత్తర, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.98,700
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.8,932
3 శాతం జీఎస్టీతో	రూ.9,200
సవర (8 గ్రా)	రూ.73,600

గరిష్టం/కనిష్టం
33.1 /27.8

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. రాత్రి నుంచి చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

షెడ్యూల్డ్ తెగల సహకార సంఘం ఏర్పాటు



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న డీసీఓ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మంగళవారం రాపూరు షెడ్యూల్డ్ తెగల దీన్‌ధన్ వికాస సహకార సంఘాన్ని జిల్లాలో ఏర్పాటు చేసినట్లు జిల్లా సహకారశాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప తెలిపారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాచీన గిరిజన తెగకు చెందిన యానాది కుటుంబాలను సమీకృతం చేసి వారి జీవనోపాధిని పెంచేందుకు దోహదపడుతుందన్నారు. రాపూరు మండలంలోని వెలిగొండ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న వెయ్యి యానాది కుటుంబాలను ఈ సంఘంలో చేర్పించి కలపేతర అటవీ ఫలసాయాలు, ముడి సరుకుల ఉత్పత్తులను బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా వీరికి ఆర్థిక సాధికారతను కల్పించేందుకు ఈ సహకార సంఘం ఉపయుక్తంగా పనిచేస్తుందన్నారు. సంఘ సభ్యులకు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ నెల్లూరు (ఐటీడీఏ) ద్వారా నైపుణ్యం పెంపు, మార్కెటింగ్‌పై శిక్షణ కల్పిస్తామన్నారు. అనంతరం సంఘ సభ్యులకు సంఘ నిర్వహణ, ఆశయాలు, సభ్యత్వం, సమావేశాలు, ఎన్నికలు, రికార్డుల నిర్వహణ, ఆడిట్‌పై శిక్షణ ఇచ్చారు. సంఘ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బైలాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాపూరు సబ్ డివిజన్ సహకార అధికారి రవికుమార్, ఏపీఓ రమణయ్య, ఐటీడీఏ మేనేజర్ బాలాజీ, డీసీఓ కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

29 నుంచి వికసిత్ కృషి సంకల్ప అభియాన్

నెల్లూరు (పొగతోట): భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే సమన్వయకర్త డాక్టర్ జి.లలితశివజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తు వ్యవసాయ ప్రణాళికగా కేవీకే బృందం, ఇతర శాస్త్రవేత్తలు, అధికారులు కలిసి జిల్లా వ్యాప్తంగా పర్యటించనున్నామన్నారు. కొత్తరకం వంగడాలు, సాంకేతికతలపై రైతులతో అధికారులు చర్చించనున్నారు. పశు సంపద, పశువుల ఉత్పత్తి, సేంద్రియ వ్యవసాయం మొదలగు అంశాలపై సందర్శన చేపడతామని తెలిపారు.

హుండీల్లో కానుక లెక్కింపు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలోని హుండీల్లో కానుకల లెక్కింపు మంగళవారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగింది. ఈఓ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ హుండీలు, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.15,77,517 లక్షల కానుకలు వచ్చాయని తెలిపారు. అందులో బంగారం 112 గ్రాములు, వెండి 24 గ్రాములు, యూఏఈ దిరామ్స్ 10 భక్తులు సమర్పించారని వివరించారు. బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రా'బడి' వ్యాపారం



జిల్లాలో విద్య రా'బడి' వ్యాపారంగా మారింది. ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లను పాఠశాలలుగా మార్చేసి మైమరిపించే హై స్టాండెర్డ్ పేర్లు తగిలించి తల్లిదండ్రుల నుంచి రూ.వేల నుంచి రూ.లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిబంధనలతో సంబంధం లేకుండా గాలి, వెలుతురు, మైదానం లేని అపార్ట్‌మెంట్లల్లో వీధి వీధికో పాఠశాల పుట్టగొడుగుల్లా వెలుస్తోంది. పాఠశాల నిర్వహణకు కనీస వసతులు లేకపోయినా.. ముడుపులు ముట్టజెప్పితే చాలు జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే అనుమతులు జారీ చేస్తున్నారు.

- పుట్టగొడుగుల్లా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు
- ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో నిర్వహణ
- ముడుపులిస్తే అనుమతులు
- రూ. 20 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు ఫీజులు
- క్వాలిఫైడ్ టీచర్లు లేకుండానే బోధన
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై కలెక్టర్ సీరియస్



నెల్లూరు (టౌన్): జిల్లా కేంద్రంతోపాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో అపార్ట్‌మెంట్లు, ఇళ్లను కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలుగా మార్చేస్తున్నారు. జిల్లాలో ఈ తరహాలో 1000కు పైగా పాఠశాలలు ఉన్నాయి. ప్రధానంగా నాలుగైదు పాఠశాలల యాజమాన్యాలు పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే విద్యార్థులకు సరైన గాలి, వెలుతురు లేకుండా చీకటిలోనే చదువు చెబుతున్న పరిస్థితి ఉంది. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే పిల్లలు ప్రమాదం బారిన పడాల్సిందే. పాఠశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పలు నిబంధనలు జారీ చేసింది. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్ అనుమతికి ఎంఈఓ, హైస్కూల్ అనుమతికి డిప్యూటీ డీఈఓ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి అనుమతులు జారీ చేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం తరగతి గది 15x21 సైజులో ఉండాలి. విద్యార్థికి విద్యార్థికి మధ్య 5x7 అడుగులు దూరంగా ఉండాలి. పాఠశాలకు కనీసం 3 ఎకరాల మైదానం ఉండాలి. శానిటరీ, స్ట్రక్చరల్ సౌండ్‌లెస్, అగ్నిమాపక శాఖ నుంచి ఫైర్ సర్టిఫికెట్‌ను తీసుకోవాల్సి ఉంది. తరగతి గదులతో పాటు గ్రంథాలయం, ల్యాబ్, టీచింగ్ ఎయిడ్స్, ఆట పరికరాలు, ప్రిన్సిపల్, స్టాఫ్‌కు వేరుగా గదులు, సరైన గాలి, వెలుతురు ఉండేలా తరగతి గదులు ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో తూతూ మంత్రంగా పరిశీలించి వెంటనే అనుమతులు జారీ చేస్తున్నారనే దానికి జిల్లాలోని అనేక పాఠశాలల భవనాలే నిదర్శనంగా ఉన్నాయి. స్కూల్ కమిటీ, పేరెంట్స్ కమిటీ తదితర వాటిని ఏర్పాటు చేయాలి.

అధికారులకు తెలిసినా..

ప్రభుత్వ నిబంధనలు ప్రకారం లేకున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు. పాఠశాలను బట్టి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎంఈఓ నుంచి జిల్లా విద్యాశాఖాధికారి వరకు పంచుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. పాఠశాలల నిర్వహణ అధ్వానంగా ఉందని తెలిసినా అటు వైపు కన్నెత్తి చూడరన్న విమర్శలు ఉన్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి. పాఠశాలల నిర్వహణ, అధిక ఫీజుల వసూళ్లు, రకరకాల పేర్లుతో దోపిడీ తదితర వాటిపై ఇటీవల రాష్ట్ర పేరెంట్స్ అసోసియేషన్, విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్ ఆనంద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ క్షేత్రస్థాయిలో పాఠశాలలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావును ఆదేశించారు. జిల్లాలో అధిక సంఖ్యలో మంత్రి పొంగూరు నారాయణకు చెందిన పాఠశాలలే ఉండడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు కలెక్టర్ ఆదేశాలను పాటించి నిబంధనల ప్రకారం లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటారా? లేక మిన్నకుంటారన్న వ్యవహారాన్ని వేచి చూడాల్సి ఉంది.

నిబంధనలు తూచ్..

ఏ పాఠశాలకు మైదానం లేని పరిస్థితి ఉంది. లైబ్రరీ ఉన్నా అందులో పుస్తకాలు ఉండవు, కొన్ని పాఠశాలల్లో పేరుకే ల్యాబ్ ఉంటుంది. అక్కడ రసాయనాలు ఉండవు. పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఉండవు. ప్రతి పాఠశాలలో క్వాలిఫైడ్ టీచర్లు ఉండాలి. విద్యాశాఖ అధికారులకు చూపించే రిజిస్టర్‌లో మాత్రం క్వాలిఫైడ్ టీచర్ల పేర్లు ఉంటాయి. కానీ సదరు వ్యక్తులు మాత్రం ఉండరు. వారి స్థానంలో ఇంటర్, డిగ్రీ చదివిన వ్యక్తులతో బోధన సాగిస్తుంటారు. పాఠశాలలకు రకరకాల పేర్లు పెట్టి రూ. 20 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రతి ఏటా 10 నుంచి 15 శాతం ఫీజులు పెంచుకుంటూ దోపిడీకి పాల్పడుతున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం



అధిక ఫీజుల వసూళ్లు, నిబంధనల ప్రకారం లేని పాఠశాలలు, రకరకాల పేర్లతో ఉన్న పాఠశాలల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలని ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. వారు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి నిబంధనల ప్రకారం లేని పాఠశాలలకు నోటీసులు జారీ చేసే పనిలో ఉన్నారు. ప్రతి యాజమాన్యం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సిందే. ఇందులో ఎవరికి మినహాయింపు లేదు. పాఠశాలకు సంబంధించి టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ వివరాలు, వారికిచ్చే వేతనాలు, పాఠశాల పూర్తి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఆ ప్రకారం ప్రతి పాఠశాల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి.

– బాలాజీరావు, డీఈఓ

కాకాణి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు

- మాజీ మంత్రి కారుమూరి



గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించిందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. చట్టాలపై, న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందని కాకాణిపై పెట్టిన ఆధారాల్లేని కేసుల నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. మంగళవారం ఆయన నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి నెల్లూరు డైకాస్‌రోడ్డులోని కాకాణి నివాసంలో వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కాకాణిపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసు నిలువదన్నారు. తప్పుడు కేసులతో వైఎస్సార్‌సీపీ నేతలను బెదిరించాలనుకుంటే బెదిరే వాళ్లు ఎవరూ లేరన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ తప్పుడు కేసులు పెట్టే అధికారులు, పోలీసులు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మనోధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. గోవర్ధన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా నిచ్చారు.

కాకాణి అరెస్ట్ అప్రజాస్వామికం

– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ఉదయగిరి: కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తూ అరెస్ట్ చేసి జైలుకు పంపుతుండడం రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో కూటమిపై పెరుగుతున్న అసంతృప్తిని కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగిందన్నారు. మైనింగ్‌కు సంబంధించి ఎలాంటి పాత్ర లేని మాజీ మంత్రి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను అందరూ కలిసికట్టుగా ఎదుర్కొని ధైర్యంగా ముందుకు సాగుతామన్నారు.

ప్రశ్నించే గొంతు నొక్కడం దారుణం

– మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే గొంతులు నొక్కేలా ప్రభుత్వం, అధికారులు ప్రవర్తించడం దారుణమని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ఈ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అక్రమంగా మైనింగ్ కేసులో కాకాణిని ఇరికించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకపోగా, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల నోరు నొక్కుతోందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడరని, తామంతా కాకాణికి అండగా ఉంటామన్నారు. కూటమి పాలనను, జరుగుతున్న అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో వారికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.



తిరుమలాపురంలోని అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ నరికివేత

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ నరికివేత



లారీలో లోడింగ్ చేసిన జామాయిల్ కర్ర



కూలీలను విచారిస్తున్న పోలీసులు

- మళ్లీ విజృంభించిన మాఫియా
- అధికార పార్టీ నేతల ప్రమేయంపై ప్రచారం

ఉదయగిరి: మండలంలోని తిరుమలాపురంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో జామాయల్ చెట్లను కలప మాఫియా నరికివేస్తోంది. ఆ గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 70 ఎకరాల్లో 15 ఏళ్ల క్రితం జామాయిల్ మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి బాగా ఏపుగా పెరిగాయి. దీంతో వీటిపై కన్నేసిన కొంత మంది అక్రమార్కులు నరికేస్తున్నారు. నేలటూరుకు చెందిన ఇత్తడి శ్రీను అనే వ్యక్తి మంగళవారం మూడు లారీల్లో 70 మంది కూలీలతో ఆ చెట్లు నరికి కర్రను లారీలకు లోడ్ చేస్తున్నాడు. సీఐడీ స్వాధీనత భూముల్లో చెట్లు నరికివేస్తున్నట్లు స్థానికులు కొందరు పోలీస్ డయల్ 100కు కాల్ చేశారు. దీంతో ఘటనా స్థలానికి పోలీసులు బయల్దేరే క్రమంలో ఓ పోలీసు ఉన్నతాధికారి అదేశాలతో చాలా సేపటికి చేరుకున్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీ పెద్దల ప్రమేయం ఉన్నందున ఆ అధికారి స్థానిక పోలీసులను తొందర పడకుండా వేచి చూడాలని చెప్పినట్లు సమాచారం. అయితే స్థానికులు పదేపదే పైఅధికారులకు ఫిర్యాదు చేయడం, మీడియా ప్రతినిధులు అక్కడి వెళ్లడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చెట్ల నరికివేతను నిలిపివేశారు. ఈ ఒక్క రోజే సుమారు 5 ఎకరాల్లో సుమారు 100 టన్నుల కర్ర నరికేసినట్లు అంచనా వేస్తున్నారు.

సంకటంలో పోలీసులు

ఈ వ్యవహారంలో అధికార పార్టీ పెద్దల హస్తం ఉండడంతో పోలీసులు ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామస్తుల సమాచారంతో చెట్ల నరికివేతను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే చెట్ల నరికివేతపై సీఐడీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంది. వారు సాయంత్రం వరకు రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. దీంతో పోలీసులు ఎవరిపై కేసులు నమోదు చేయడం గానీ, వాహనాలు స్వాధీనం చేసుకోవడం కానీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై స్థానిక ఎస్సై ఇంద్రసేనారెడ్డిని వివరణ కోరగా ఈ వ్యవహారంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఎవరైనా ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సొంతంగా స్కానింగ్ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

నెల్లూరు (అర్బన్): డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా సొంతంగా ఎవరైనా స్కానింగ్ పరీక్షలు చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ సుజాత హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం జరిగింది. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీలు స్కానింగ్ పరీక్షలకు రెఫరల్ చేయరాదన్నారు. ఆర్ఎంపీల సూచన మేరకు గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసేందుకు 10 డెకాయ్ ఆపరేషన్ టీమ్‌లను ఏర్పాటుకు కమిటీని నియమించామన్నారు. జిల్లాలో ప్రస్తుతం బాలుర బాలికల నిష్పత్తి 1000కి 1011 ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో భ్రూణ హత్యలు అరికట్టేందుకు తనిఖీలు చేస్తామన్నారు. సలహా మండలి చైర్‌పర్సన్‌గా గైనకాలజిస్ట్ డాక్టర్ కిరణ్‌ను నియమించామన్నారు. ఈ సలహా సంఘం సమావేశంలో డీసీహెచ్‌ఎస్ పరిమళ, పీడీయాట్రీషియన్ హెచ్‌ఓడీ సర్దార్‌సుల్తానా, డీఐఓ ఉమామహేశ్వరి, డివిజనల్ ప్రోగ్రాం అధికారి దయాకర్, డీడీ పీఆర్వో సదారావు, డెమో అధికారి కనకరత్నం, ఎన్జీఓ ప్రతినిధులు కవితారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా అశ్వవాహన సేవ



అశ్వవాహనంపై ఊరేగుతున్న మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అశ్వవాహన సేవ వేడుకగా జరిగింది. స్వామి అమ్మవార్లను సుందరంగా అలంకరించి అశ్వవాహనంపై ఊరేగించారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని అశ్వవాహన సేవను చూసి తరించారు. రాత్రి ప్రత్యేక పుష్పాలంకరణ, ఏకాంత సేవ కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం ధ్వజావరోహణం, అలకల తోపు కార్యక్రమాలను ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

రొయ్యల గుంతలు తొలగింపు



రొయ్యల చెరువుల కట్టలను తెగ్గొడుతున్న మత్స్యశాఖ అధికారులు

ముత్తుకూరు (పొదలకూరు): మండలంలోని బ్రహ్మదేవం పంచాయతీ వెడిచర్లలో వెనామీ రొయ్యల సాగు చేసే గుంతలను మత్స్యశాఖ అధికారులు మంగళవారం తొలగించారు. 66 ఎకరాల్లో 13 మంది రైతులు నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల సాగు చేస్తున్నారు. ఈ గుంతల నుంచి విడుదలవుతున్న కలుషిత జలాలతో వరిసాగు దెబ్బతిని, తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీన మత్స్యశాఖ జేడీ శాంతి రైతులతో మాట్లాడి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అయితే రైతులు స్పందించకపోవడంతో మత్స్యశాఖ ఏడీ చాన్‌బాషా రొయ్యల సాగు చేసే గుంతల కట్టలను జేసీబీతో తెగ్గొట్టించారు. మత్స్యశాఖ ఏడీ మాట్లాడుతూ 66 ఎకరాల్లో 44 గుంతలు ఉన్నాయని, అన్నింటిని తొలగిస్తామన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖలు కలిపి ఒక టీమ్‌గా ఏర్పడి రొయ్యల గుంతలను తొలగిస్తున్నట్లు తెలిపారు. రొయ్యల గుంతలను తొలగించే క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

జీవితాల్లో వెలుగులు నింపేందుకు..


పద్మ (ఫైల్)

వేలూరు: ఓ మహిళ అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసినట్లు సీఎంసీ ఆస్పత్రి వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. వివరాలు.. నెల్లూరు జిల్లాలోని దస్తగిరి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు భార్య కంచర్ల పద్మ (58) ఆదివారం సాయంత్రం చిత్తూరు జిల్లా పలమనేరు వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. పద్మ తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం వేలూరులోని సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. వైద్యులు ఆపరేషన్ చేసి అవయవాలను చెన్నైలోని మియాట్, ఎంజీఎం, వేలూరు సీఎంసీ ఆస్పత్రులకు దానంగా ఇచ్చారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

• ఎస్ఈ విజయన్



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించి పరిష్కరించాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ఆయన జిల్లా విద్యుత్, అకౌంట్స్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యుత్ ఉద్యోగులందరూ యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని జూన్ నెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం రోజున నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. విద్యుత్ సిబ్బంది వారికి కేటాయించిన హెడ్‌క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలన్నారు. లో ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో సమస్యలు తదితరాలపై తక్షణమే స్పందించాలన్నారు. విద్యుత్ మరమ్మతు పనులు చేసే సమయంలో అధికారులు కూడా పాల్గొనాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం వహించే సిబ్బందిపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదృశ్యం ఘటనలపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. సుందరయ్యకాలనీ బీ బ్లాక్‌లో కె.శ్రీనివాసులు కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గత నెల 29వ తేదీన శ్రీనివాసులు పనికి వెళ్లాడు. అప్పటి నుంచి ఆయన జాడ తెలియరాలేదు. బాధిత కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో తండ్రి అదృశ్యంపై సోమవారం రాత్రి కుమారుడు మణి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

• పుట్టింటికి వెళ్లొస్తానన్న వివాహిత అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. మహేంద్ర, సాయికుమారి దంపతులు బుజబుజనెల్లూరు ప్రాంతంలో ఉంటున్నారు. ఈనెల 25వ తేదీన వివాహిత పడారుపల్లిలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లొస్తానని అత్త అరుణకు చెప్పి బయలుదేరింది. సాయంత్రమైనా ఆమె ఇంటికి రాలేదు. మహేంద్ర తన అత్తింటివారిని భార్య విషయమై ఆరాతీయగా అక్కడకు రాలేదని తెలిసింది. దీంతో ఆమె కోసం గాలించినా జాడ తెలియకపోవడంతో బాధితుడు మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

• మహిళ మృతి

కావలి(జలదంకి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన కావలి రూరల్ మండలం రామచంద్రాపురానికి చెందిన కోసూరు తిరుపతమ్మ (55) అనే మహిళ నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. తిరుపతమ్మ ఈనెల 24వ తేదీన గ్రామంలోని వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా అదే ఊరికి చెందిన కొమ్మన శివకుమార్ మోటార్‌బైక్‌పై వస్తూ అతివేగంగా ఆమెను ఢీకొట్టాడు. గాయపడిన తిరుపతమ్మను చికిత్స నిమిత్తం కావలిలోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి చెన్నైకి తరలించారు. సోమవారం ఆమెను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. దీనిపై కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశలు ఆవిరైనట్లే..!

కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గతేడాది లభించిన ధరలను చూసి అప్పులు చేసి రెండింతల పెట్టుబడులతో సాగు చేయగా కోలుకోలేని దెబ్బతగులుతోంది. బ్యారన్లు, పొలాలు కౌలు తీసుకుని సాగు చేసిన రైతులు ఈ ఏడాది అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితులు నెలకొన్నాయి. పెట్టుబడులకు, వేలంలో లభిస్తున్న ధరలకు ఏ మాత్రం పొంతన కనిపించడం లేదు.

- కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతు దిగాలు
- రోజురోజుకూ దిగజారుతున్న ధరలు
- లోగ్రేడ్‌ను కొనుగోలు చేయని వ్యాపారులు
- కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్న వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు పూసాల అక్క పునాయుడు. ఈయనది కలిగిరి మండలంలోని రావులకొల్లు గ్రామం. నాలుగు పొగాకు బ్యారన్లున్నాయి. ఈ ఏడాది 30 ఎకరాల్లో సాగు చేపట్టాడు. ప్రస్తుతం ధరలు చూస్తుంటే ఎకరాకు రూ.50 వేల వరకు నష్టం వచ్చే అవకాశం ఉందని చెబుతున్నాడు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని కోరుతున్నాడు.


వేలంలో కొనుగోలు చేయకపోవడంతో ఇంటికి తీసుకెళ్లేందుకు ట్రాక్టర్‌లో ఎక్కించిన పొగాకు బేళ్లు

కలిగిరి: పొగాకు రైతులు ఈ ఏడాది నిండా మునిగిపోతున్నారు. గత సంవత్సరం వరకు బ్యారన్‌కు 34 క్వింటాళ్ల దిగుబడికి అనుమతి ఉండేది. ఈ ఏడాది 42.75 క్వింటాళ్లకు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. దీంతో ధరలు బాగా రావడం, కొన్ని కంపెనీల ప్రోత్సాహంతో డబ్బులు సంపాదించుకోవచ్చని ఆశతో అప్పు చేసి 20 శాతం మేర అధికంగా పొగాకు చేశారు. ప్రస్తుత ధరలు చూస్తున్న రైతులు వేలం ముగిసే నాటికి ఏమేర నష్టపోతామోనని ఆందోళన చెందుతున్నారు.

లోగ్రేడ్ మాకొద్దు

ఈ ఏడాది పండించిన పంటలో సుమారు 30 శాతం మీడియం, 30 శాతం లోగ్రేడ్ దిగుబడి వచ్చింది. గతేడాది వాటికి మంచి ధరలు లభించాయి. ఈసారి వేలం ప్రారంభమై 50 రోజులు దాటినా లోగ్రేడ్‌ను కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేయడం లేదు. మీడియం గ్రేడ్‌ను నామమాత్రంగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఆ రకాలను ఇళ్ల వద్దే ఉంచాల్సిన పరిస్థితి వచ్చింది. ఎక్కువ రోజులు పొగాకు మండెలుగా


కలిగిరి పొగాకు వేలం కేంద్రం

ఉంటే నాణ్యత దెబ్బతింటుందని ఆవేదన చెందుతున్నారు.

కుమ్మక్కవడంతో..

రీజియన్ పరిధిలో 32 కంపెనీలు పొగాకు కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకోగా కేవలం 18 మాత్రమే వేలంలో పాల్గొంటున్నాయి. ప్రధానంగా ఐటీసీ కంపెనీ 50 శాతం పొగాకు బేళ్లను కొనుగోలు చేస్తుండగా మిగిలినవి నామమాత్రంగా కొంటున్నాయి. కంపెనీల ప్రతినిధులు సిండికేట్‌గా మారి ధరలు పెరగనీయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కిలోకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.210, సరాసరిన రూ.255 లభిస్తోంది. రూ.280కు కొన్ని బేళ్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేదని, ఇతర కారణాలు చూపుతూ వ్యాపారులు తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. సిండికేట్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రోజూ సుమారు 30 శాతం బేళ్ల వరకు తిరస్కరిస్తున్నారు. వాటిని ఇళ్లకు తీసుకెళ్లేందుకు రైతులపై అదనపు భారం రైతులపై పడుతోంది.

ప్రజాప్రతినిధులెక్కడ?

పొగాకు రైతుల బాధలను కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. గిట్టుబాటు ధరల కోసం ఆందోళనలు, నిరసనలు చేస్తున్న సమయంలో హడావుడిగా వేలం కేంద్రాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యేలు, అధికారులు తమను ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవడం లేదని రైతులు చెబుతున్నారు.

నాడు ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

2019 – 20లో పొగాకుకు గిట్టుబాటు ధరల్లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పరిస్థితిని చూసి వెంటనే స్పందించారు. ఏపీ మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి మార్కెట్‌లో పోటీ పెరిగేలా చర్యలు తీసుకున్నారు. రైతులు నష్టాల బారిన పడకుండా గట్టెక్కించారని ప్రస్తుతం రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

జిల్లాలో కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాల పరిధిలో..

రైతులు	: 3,469 మంది
బ్యారన్లు	: 2,963
బోర్డు అనుమతించిన సాగు విస్తీర్ణం	: 9,931 హెక్టార్లు
రైతులు సాగు చేసిన విస్తీర్ణం	: 9,973 హెక్టార్లు
బోర్డు అనుమతించిన దిగుబడి	: 12.65 మిలియన్ కిలోలు
రైతులు పండించిన పంట (అంచనా)	: 18.30 మి.కి.

లోగ్రేడ్ కొనుగోలు చేయడం లేదు



లోగ్రేడ్ పొగాకు ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. నాణ్యమైన పొగాకు కొనుగోలుకు కూడా వంకలు చూపుతూ వ్యాపారులు ధరలు పూర్తిగా తగ్గిస్తున్నారు. గతేడాది ధరలు చూసి ఈసారి ఎక్కువగా సాగు చేశాం. వేలంలో లభిస్తున్న ధరల ప్రకారం తీవ్రంగా నష్టపోతాం.

– వీరవల్లి మాధవరావు, ఉప్పులూరు, కొండాపురం మండలం

పరిస్థితులకు అనుగుణంగా అమ్ముకోవాలి



ప్రస్తుతం మార్కెట్‌లో ఏ రకం పొగాకును వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారో రైతులు గమనించాలి. పరిస్థితులకు అనుగుణంగా ఆయా గ్రేడ్లను వేలానికి తీసుకొచ్చి అమ్మకాలు జరపాలి. ధరల విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. లోగ్రేడ్, మీడియం గ్రేడ్‌ను కొనుగోలు చేసేలా చూస్తాం. రైతులకు గిట్టుబాటు ధరలు లభించడానికి చర్యలు తీసుకుంటాం.

– టి.ఇషాక్ స్వర్ణదత్, వేలం నిర్వహణాధికారి, కలిగిరి

అల్లూరులో కలెక్టర్ ఆనంద్ పర్యటన


విత్తనాలను అందజేసిన ఆనంద్, చిత్రంలో అధికారులు

అల్లూరు: మండల పరిధిలోని గోగులపల్లి సీఎస్ పురం గ్రామంలో మంగళవారం కలెక్టర్ ఒ.ఆనంద్ పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ద్వారా ఉచిత నూనె గింజల విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశీయ నూనె గింజల ఉత్పత్తి పెంపునకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, ఆత్మ పీడీ శివనారాయణ, ఏడీఏలు నాగరాజు, నర్సోజీ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రజనీకాంత్, ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. కోవూరుకు చెందిన పి.బాబురావు (30), కపాడిపాళేనికి చెందిన భవానీని పది సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం. బాబురావు డీజేగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ కపాడిపాళెంలోని నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల నడుమ విభేదాలు చోటుచేసుకున్నాయి. తరచూ గొడవపడుతుండేవారు. బాబురావు నెలరోజుల క్రితం భార్యతో గొడవపడి తల్లిదండ్రుల ఇంటికి వచ్చాడు. సంతోషంగా ఉన్న జీవితం ఇలా అయ్యిందంటూ లోలోన మదనపడుతూ 20 రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు బాబురావుకు చికిత్స చేయించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈనెల 25వ తేదీన పని ఉందంటూ అతను ఇంట్లో నుంచి బయటికొచ్చాడు. అదేరోజు నెల్లూరులోని సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజంతా లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. 26వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో రూమ్‌లోకి వెళ్లాడు. సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన స్వీపర్ బాబురావు ఉరేసుకుని ఉండటాన్ని గమనించి లాడ్జి యాజమాన్యానికి తెలియజేశాడు. వారు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడి ఉన్న బాబురావును చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సంతపేట ఎస్సై జి.బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

కాలు ఒకచోట, మృతదేహం మరోచోట

• వాహనం ఢీకొని యువకుడి మృతి

కందుకూరు రూరల్: ఓ వ్యక్తి జాతీయ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందిన ఘటన మండలంలోని మాల్యాద్రి కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ విషయం ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓగూరు గ్రామానికి చెందిన ఎస్. కల్యాణ్ (28) ఆదివారం కందుకూరుకు వచ్చాడు. తిరిగి రాత్రి గ్రామానికి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. జాతీయ రహదారిపైకి బస్సు వెళ్లగా స్పీడ్ బ్రేకర్ వద్ద నెమ్మదించడంతో ఊరు వచ్చిందని భావించి అతను దిగాడు. ఇది ఊరు కాదని గమనించే లోపు బస్సు వెళ్లిపోయింది. నడుచుకుంటూ వెళ్తుండగా మాల్యాద్రి కాలనీ సమీపంలో రోడ్డు దాటుతుండటంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో కల్యాణ్ కాలు తెగిపోయింది. సోమవారం తెల్లవారుజామున కాలును గమనించిన గ్రామస్తులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారమిచ్చారు. వారు మృతదేహం కోసం రోడ్డు వెంబడి వెతికారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రవి గార్డెన్ సమీపంలో గుర్తించారు. కల్యాణ్‌కు ముగ్గురు పిల్లలున్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి. సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్రనాయక్ తెలిపారు. కాగా కల్యాణ్ నడుచుకుంటూ వెళ్తుండగా ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు వేగంగా వెళ్తూ ఢీకొట్టిందని అనుమానిస్తున్నారు. ఢీకొట్టిన వాహనమే మృతదేహాన్ని ఈడ్చుకుంటూ వెళ్లినట్లు చెబుతున్నారు.

పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి: మండలంలోని కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు ధర గరిష్ఠంగా రూ.280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 525 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. 408 బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 117 బేళ్లను తిరస్కరించారు. కిలో కనిష్ఠంగా రూ.200, సరాసరిన రూ.242.02 లభించింది. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని నిర్వహణాధికారి టి.ఇషాక్ స్వర్ణదత్ తెలిపారు.

డీసీపల్లిలో..

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 465 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 545 బేళ్లు వచ్చాయన్నారు. 465 బేళ్లను విక్రయించామని, మిగిలిన



వాటిని వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 62,064.5 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,53,38,753.20ల వ్యాపారం జరిగిందన్నారు. కిలోకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.200, సగటున రూ.247.14 ధర లభించిందన్నారు. వేలంలో 8 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

పోలేరమ్మ దర్శనానికి బయలుదేరి..

• తల్లీకుమార్తెను వేగంగా ఢీకొట్టిన లారీ
• అక్కడికక్కడే మృతి


మమత (ఫైల్)


వెంకమ్మ (ఫైల్)

కందుకూరు/గుడ్లూరు: దైవ దర్శనానికి వెళ్తున్న తల్లీకుమార్తెను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరూ మృతిచెందారు. ఈ ఘటన కోల్‌కతా – చెన్నై జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. మృతుల బంధువులు, పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం రాజుగారి చింతలపాళేనికి చెందిన గద్దేటి వెంకమ్మ (50)కు పిల్లల్లేరు. తన అక్క లక్ష్మీకాంతమ్మ కుమార్తె మమత (32)ను దత్తత తీసుకుని పెంచి పెద్ద చేసింది. గుడ్లూరు మండలం మోచర్ల గ్రామానికి చెందిన దాసరి మనోహర్‌కు మమతనిచ్చి వివాహం చేసింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. మమత, మనోహర్ హైదరాబాద్‌లో జ్యూస్ షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మోచర్ల గ్రామంలోనే ఉంటున్న లక్ష్మీకాంతమ్మ ఇటీవల ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో ఆమెను చూసేందుకు వెంకమ్మ, మమత రెండు రోజుల క్రితం మోచర్లకు వచ్చారు. మంగళవారం గ్రామంలోనే కోల్‌కతా – చెన్నై జాతీయ రహదారికి తూర్పువైపున ఉన్న గ్రామదేవత పోలేరమ్మ దేవాలయం వద్దకు వెళ్లి మొక్కు చెల్లించేందుకు గ్రామానికి చెందిన జల్లెడ వెంకటరమణమ్మ, ఆమె కుమార్తె వైష్ణవితో కలిసి నలుగురు అమ్మవారి ఆలయానికి బయలుదేరారు. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు మార్జిన్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్‌కు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వీరిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో వెంకమ్మ, మమతలు లారీ కింద పడి అక్కడికక్కడే చనిపోయారు. మరోవైపు తల్లీకుమార్తె వెంకటరమణమ్మ, వైష్ణవి త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుని స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదం గురించి సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం చోటు చేసుకుంటున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దైవదర్శనానికి వెళ్తూ ఇలా రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తె మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

స్వగ్రామానికి వెళ్తుండగా..

• వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూరు: నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మంగళవారం ఆత్మకూరు పోలీస్ సర్కిల్ పరిధిలో జరిగింది. ఎస్సై ఎస్కే జిలానీ కథనం మేరకు.. సంగం మండలం చెన్నవరప్పాడు గ్రామానికి చెందిన గొల్లపల్లి శీనయ్య (57) పని నిమిత్తం కోలగట్లకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు ముంబై రహదారిపై ఉన్న ధాబా సమీపంలో రోడ్డు దాటుతుండగా బద్వేల్ నుంచి నెల్లూరుకు ప్లాస్టిక్ పైపుల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో శీనయ్య చనిపోయాడు. సమాచారం అందుకున్న ఆత్మకూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధుల్లో చేరిన సీహెచ్‌ఓలు


ఎన్జీఓ నేతలను కలిసిన సీహెచ్‌ఓ అసోసియేషన్ వారు

నెల్లూరు(అర్బన్): సమస్యలు పరిష్కరించాలంటూ దాదాపు నెలరోజులు సమ్మె చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు విధుల్లో చేరారు. సమ్మెకు సహకరించిన ఎన్జీఓ అసోసియేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, ఇతర పలు సంఘాల నాయకులను మంగళవారం వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ అసోసియేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్కే ఆదిల్ మాట్లాడుతూ అధికారులు, వివిధ అసోసియేషన్ల నేతలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు పెంచలరావు, ఆంజనేయవర్మ మాట్లాడుతూ న్యాయబద్ధమైన పోరాటానికి తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అసోసియేషన్ నాయకులు భానుమహేష్, రెబేకా, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10



ఏం జరిగిందో..

• లాంజ్ బాత్‌రూమ్‌లో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఆర్టీసీ ప్రాంగణంలోని ఎంఎస్ఆర్ డీలక్స్ లాంజ్ బాత్‌రూమ్‌లో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలం కారనిమిట్టకు చెందిన ఎస్.విజయకుమార్ (26) మదనపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతడికి రెండు నెలల క్రితం సమీప బంధువైన ఉషతో వివాహమైంది. సోమవారం విజయకుమార్ మదనపల్లిలోని వైద్యశాలకు వెళ్లాడు. డాక్టర్ సూచనల మేరకు మందులు తీసుకెళ్లేందుకు నెల్లూరుకు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఉన్న ఎంఎస్ఆర్ డీలక్స్ లాంజ్‌లో బాత్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. ఈ విషయాన్ని గమనించిన లాంజ్ నిర్వాహకులు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మంగళవారం నెల్లూరుకు చేరుకున్న బాధిత కుటుంబం విజయకుమార్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. మృతుని తమ్ముడు చందు ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. ఎస్సై వీసీ సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 41.388 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 41.388 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 1,880, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.